**KALVAKUNTLA KAVITHA**
**M.L.C.**
LOCAL AUTHORITIES CONSTITUENCY
NIZAMABAD

**Flat No: 202, Hill Top Residency,**
**Road No: 14, Banjarahills,**
**Hyderabad, T.S - 500034**
**Ph No: 040 - 2359 9999**
**E-Mail: kavitha.telangana@gmail.com**

తేదీ : 23.01.2025

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి,
ముఖ్యమంత్రి,
తెలంగాణ రాష్ట్రం.

**విషయం: కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు జాప్యం గురించి**

శాసన సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అనేక హామీల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రధానమైనది. బీసీలకు రిజర్వేషన్లు, నిధులు, సంక్షేమం, చేతి వృత్తుల వారికి సాయంతో పాటు ఆయా సామాజిక వర్గాలకు మద్ధతు వంటి అనేక హామీలను కాంగ్రెస్ పార్టీ ఆ డిక్లరేషన్ లో పొందుపరిచింది.

అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కామారెడ్డి డిక్లరేషన్ లో ఉన్న ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడం శోచనీయం. ఇచ్చిన హామీలను అమలు చేయని చరిత్ర కాంగ్రెస్ పార్టీదని చెప్పడానికి ఇదొక ఉదాహరణ. బీసీలకు ఏటా రూ. 20 వేల కోట్ల చొప్పన ఐదేళ్లలో రూ లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి 2024-25 బడ్జెట్ లో అరకొర కేటాయింపులు చేసి తొలి ఏడాదే కామారెడ్డి డిక్లరేషన్ ను మీరు ఉల్లంఘించారు. కాబట్టి మీ పట్ల బీసీ వర్గాల్లో ఏ మాత్రం విశ్వాసం లేదు. మీ వైఖరితో రాష్ట్రంలో బీసీలంతా తీరని అన్యాయానికి గురవుతున్నారు.

కామారెడ్డి డిక్లరేషన్ లో ప్రధాన హామీ అయిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడం. "కుల గణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోపే బీసీలకు రిజర్వేషన్ల పెంపు" అని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో స్పష్టంగా పేర్కొని ఉంది. 6 నెలలు గడిచాయి... ఏడాది గడిచింది.. అయినా కూడా రిజర్వేషన్ల పెంపునకు అతీగతీ లేదు. అశాస్త్రీయంగా బీసీ గణన నిర్వహించి, డెడికేటెడ్ కమిషన్ పేరిట కాలయాపన చేయడమే మీ ఆలోచనగా కనిపిస్తోంది.

కుల గణన పూర్తయ్యి కూడా చాలా కాలం అవుతుంది. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఆ వివరాలను బహిర్గతం చేయలేదు. ఆ వివరాలను తక్షణమే బహిర్గతం చేయల్సిన అవసరం ఉంది. డెడికేటెడ్ కమిషన్ నివేదిక సిద్ధమైనట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. బీసీల అంశాల పట్ల మీ ప్రభుత్వం ఎందుకు అంత నిర్లక్ష్యం వహిస్తోంది ? బీసీలంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు చులకన ? 6 నెలల్లోపే అమలు చేస్తామన్న హామీ 12 నెలలు గడిచినా ఎందుకు అమలు చేయడం లేదు ? హామీని అమలు చేయడానికి ఇంకెంత కాలం పడుతుంది ?

రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పదవీకాలం ముగిసి దాదాపు ఏడాది పూర్తయ్యింది. మండల, జిల్లా పరిషత్ ల పదవీకాలం కూడా ముగిసింది. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజా పాలన కాకుండా ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. కానీ మీ ప్రభుత్వానికి త్వరగా రిజర్వేషన్లను పెంచి ఎన్నికలను నిర్వహించాలన్న సోయి లేనట్లు అర్థమవుతోంది.

**KALVAKUNTLA KAVITHA**
**M.L.C.**
LOCAL AUTHORITIES CONSTITUENCY
NIZAMABAD

**Flat No: 202, Hill Top Residency,**
**Road No: 14, Banjarahills,**
**Hyderabad, T.S - 500034**
**Ph No: 040 - 2359 9999**
**E-Mail: kavitha.telangana@gmail.com**

బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాల్సిందే. కుంటి సాకులు చెప్పి ఇచ్చిన మాట కంటే తక్కువ రిజర్వేషన్లు కల్పిస్తే మాత్రం తెలంగాణ సమాజం మిమ్మల్ని సహించబోదు. బీసీల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మీ మెడలు వంచి హామీని అమలు చేయించుకుంటాం. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను తక్షణమే 42 శాతానికి పెంచడానికి చర్యలను ముమ్మరం చేయాలని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇక సామాజిక సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని మీకు అనేక సార్లు బహిరంగంగా విజ్ఞప్తి చేయడమే కాకుండా గౌరవ అసెంబ్లీ స్పీకరును నేను స్వయంగా కలిసి వినతి పత్రాన్ని అందించి ఏడాది గడుస్తున్నా ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేదు. దీన్ని బట్టి బీసీ పట్ల వైఖరి ఏమిటో తేటతెల్లమవుతోంది. ఇప్పటికైనా అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయలని మరోసారి మిమ్మల్ని కోరుతున్నాను.

ఇట్లు

కల్వకుంట్ల కవిత,
నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ,
బీఆర్ఎస్ పార్టీ.